# కొత్త నీరు... కొంగొత్త ఆశలు

- యువతకు పెద్దపీట, కార్యకర్తలకు చేయూత
- ముగిసిన తెదేపా మహానాడు

హైదరాబాద్, న్యూస్‌టుడే: పార్టీలోకి కొత్తనీరును ఆహ్వానిస్తూ... పార్టీ యంత్రాంగంలో కొంగొత్త ఆశలు కల్పిస్తూ రెండ్రోజుల పాటు జరిగిన తెలుగుదేశం మహానాడు ముగిసింది. ఓటమి తర్వాత పక్షం రోజుల వ్యవధిలోనే జరిగిన ఈ మహానాడు పార్టీలో ఉన్న నిరాశ, నిస్పృహల్ని కొంతవరకు దూరంచేసి... ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి పోరాడేందుకు పార్టీ నేతలను, శ్రేణులను మానసికంగా సిద్ధంచేసింది. ఓడినందుకు మరీ నిరాశ చెందాల్సిన అవసరంలేదని, బలమైన ప్రతిపక్షంగా తమదైన పాత్ర పోషించే అవకాశం ఉందన్న భరోసా పార్టీ నేతల్లోను, కార్యకర్తల్లోనూ కనిపించింది. మరోవైపు పార్టీలో సంస్కరణలు తీసుకురావాల్సిన ఆవశ్యకతను అధినేత చంద్రబాబు నుంచి ప్రతి సీనియర్ నేత వరకూ పలువురు గుర్తించినట్లే ఉన్నారు. పార్టీలో యువరక్తాన్ని నింపుతామని వీరంతా ప్రకటించారు. పార్టీ ఓటమికి నిరాశ చెందొద్దని, అలాగని అతి ధీమా కూడా వద్దని, ప్రజల్లో ఉంటూ పనిచేసుకుంటూ వెళ్తే మంచిరోజులు వస్తాయన్న భరోసాను యంత్రాంగంలో కల్పించే యత్నంచేశారు. పార్టీలో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని మురళీమోహన్, యనమల రామకృష్ణుడు తదితరులంతా సూచించారు. అధినేత చంద్రబాబు కూడా కొత్తగా వేయబోయే రాష్ట్ర కమిటీలో, అనుబంధ కమిటీల్లో 40-50 శాతం వరకూ యువతకు అవకాశం కల్పిస్తామన్నారు. రెండోసారి కూడా ప్రతిపక్షంలో కూర్చోవాల్సి రావడం, ఐదేళ్లపాటు పార్టీని నడిపించేందుకు కార్యకర్తలే ముఖ్యమన్న సంగతిని ఈ మహానాడు సంపూర్ణంగా గుర్తించింది. పార్టీ కార్యకర్తల్ని ఈ ఐదేళ్లపాటు ముందుకు నడిపించేందుకు అవసరమైన శక్తిని కొంతమేర అందించింది. నిరాశావాదాన్ని పక్కనపెట్టి మహానాడు నుంచి మళ్లీ ఆశావాదాన్ని, పార్టీకి భవిష్యత్తు ఉందనే కొంగొత్త ఆశలను వారు తమ తమ ప్రాంతాలకు తీసుకెళ్లారు. పార్టీ ఓడినా, గెలిచినా సినీ నటులు బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ రావడంతో... నందమూరి వంశం అన్ని వేళల్లో పార్టీ వెంటే ఉందన్న సంకేతం ఇచ్చారు.

వాస్తవ సమీక్ష ప్రతినిధులదే: ఈ మహానాడులో పార్టీ ఓటమికి గల కారణాలపై ప్రతినిధులు మాత్రం సూటిగా, స్పష్టంగా కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. పార్టీలో ముఠాతత్వం నుంచి... కోటరీల వరకు ఎక్కడెక్కడ లోపాలున్నాయి? ఎక్కడెక్కడ పొరపాట్లున్నాయి? అన్న అంశంపై బల్లగుద్ది మరీ అధినాయకుల మొహంమీదే చెప్పేశారు. ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్న బిజీలో కూడా కాంగ్రెస్ పార్టీ ముందుగానే అందరు అభ్యర్థులను ఒక్కసారే ప్రకటించేస్తే... తెదేపా మాత్రం చాలా ఆలస్యంగా ప్రకటించిందంటూ ఎత్తిచూపారు. అధినేత తన చుట్టూ ఉన్న కోటరీలతోనే సమయం గడిపేయకుండా... కార్యకర్తల నుంచి సమాచారం తీసుకోవాలన్నారు. పార్టీ సీనియర్ నేతలు మాత్రం తమలో ఉన్న అంతర్గత లోపాలను మాత్రం కనీసం గుర్తించే ప్రయత్నం చేయలేదు.

## తెదేపాకు రూ. 4కోట్ల విరాళాలు

### 850 మంది కార్యకర్తల రక్తదానం

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీకి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున విరాళాలు అందజేశారు. రెండురోజులుగా ఇక్కడ ఆ పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో వారు పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు విరాళాలను అందజేశారు. సుమారు రూ.4కోట్లు విరాళాల కింద అందినట్లు పార్టీ తెలిపింది. గురువారం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కంభంపాటి రామమోహన్‌రావు రూ.5లక్షలు, సీనియర్ నేత గరికపాటి మోహన్‌రావు రూ.5లక్షలు, శాసనసభ్యులు నాగం జనార్దన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, సీతాదయాకర్‌లు తలో రూ.2లక్షల చొప్పున విరాళం ఇచ్చినట్లు చంద్రబాబునాయుడు సభా వేదికపై ప్రకటించారు. రెండ్రోజుల పాటు మహానాడులో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. మొత్తం 850 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారి పేర్లను చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు సభావేదికపై చదివి వినిపించారు.